# అసతో మా....



"మాస్టారూ! మీరు తప్పుకోండి."

కాలేజీ ఆవరణ యుద్ధరంగంలా ఉంది. రెండు వర్గాల మోహరింపు. అదుపులేని ఉద్రేకాలు. అప్పుడే సెకండియర్ బి.కాంకి ఇంగ్లీషు క్లాసు తీసుకుని వస్తున్నాడు ఆనంద్. క్లాసులో అటెండెన్స్ చాలా తక్కువగా ఉండటానికి కారణమేమిటో అప్పుడు తెలియలేదు. కారిడార్ పక్కన గ్రౌండులో కేకలు, గందరగోళం, కొన్నేళ్లుగా ఎంతో మామూలైన సన్నివేశం. కొంచెం పక్కగా నిస్సహాయంగా నిలబడి ఉన్న ప్రిన్సిపాల్, మరో ఇద్దరు లెక్చరర్లు. సంగతేమిటని అడిగితే జవాబు చెప్పే స్థితిలో లేడు ప్రిన్సిపాల్. ఏదో ఆడపిల్ల గొడవని పక్కనే కెమిస్ట్రీ లెక్చరర్ చెప్పాడు. కో-ఎడ్యుకేషన్ కాలేజీల్లో ఎప్పుడూ ఉండే గొడవలే. ఇలాంటి దృశ్యాల్ని చూసినప్పుడల్లా ఆనంద్

మనసు కలుక్కుమంటుంది. మనసులో తెలీని విషాదం ఆవరిస్తుంది. ఒక్కోసారి ఆవేశం కలుగుతుంది. ప్రిన్సిపాల్‌తో పాటు తను, మరో లెక్చరర్ వాళ్లని సర్దుబాటు చెయ్యటానికి ప్రయత్నించారు.

"మధ్యలో మీకెందుకు సార్! మేం మేం తేల్చుకుంటాం."

"ఏంటిరా మీరు తేల్చుకునేది? ముందుకు రండి. చూసుకుందాం."

"మాస్టారూ! మీరు తప్పుకోండి." తననుద్దేశించి గుంపులో ఎవరిదో కేక.

తను తప్పుకోలేదు. వాళ్లని శాంతింపజెయ్యటానికి ప్రయత్నించాడు. కేకలు, కొట్లాట, తోపులాట. ఎవరో తనని బలంగా పక్కకి నెట్టేశారు. ఆ ఊపులో తను విసురుగా వెళ్లి గ్రౌండులో ఉన్న పెద్ద రాయిమీద పడ్డాడు. తర్వాతేమైందో తెలీదు.

తెలివి వచ్చేపాటికి ఇంట్లో మంచంమీదున్నాడు. తలకి గాయం. హృదయం లోతుల్లోనూ గాయమే. మంచం పక్కన ఏడుస్తూ కూర్చున్న భార్య వనజ. "లేనిపోని గొడవల్లో మీరెందుకండీ తలదూర్చటం? మీరు అడ్డం వెళ్లినంత మాత్రాన గొడవలు ఆగుతాయా చెప్పండి" అంటోంది. దీనంగా తనవంకే చూస్తున్న పదేళ్ల కొడుకు.

నిజమే, ఆగిపోవు. కానీ, కళ్లెదుట సంఘటనకి స్పందించటం తన బలహీనతా? చాలా మంది లెక్చరర్లు ఇలాంటి సంఘటనల్లో ఏ మాత్రం జోక్యం చేసుకోరు. దూరంగా నిలబడి చోద్యం చూస్తుంటారు. టీపాయ్ మీదున్న ఆ రోజు పేపరు తీసుకున్నాడు ఆనంద్. లోకల్ న్యూస్‌లో కాలేజీలో విద్యార్థుల ఘర్షణ గురించి వార్త వచ్చింది. ఇంతకీ ఎవరో ఆ అమ్మాయి? ఆ అమ్మాయి గురించి ఇంత ఘర్షణ దేనికి? కాలేజీల వాతావరణం ఎంత మారిపోయింది? తను చదువుకునే రోజుల్లో అందమైన ఆడపిల్లల పట్ల రహస్యమైన ఆరాధన ఉండేది కానీ, ఇలా పబ్లిక్ తగాదాలు ఉండేవి కావు. అడ్మినిస్ట్రేషన్‌ని ధిక్కరించటం ఎవరికీ తెలీదు.

గాయం సలుపుతోంది. ఆలోచనలు సలుపుతున్నాయి. ఏవో స్మృతుల్లో వెనక్కి.... ఎంతో వెనక్కి. అప్పుడు తనో విద్యార్థి.

❖ ❖ ❖

దగ్గర్లోనే గుంటూరు జె.కె.సి. కళాశాలలో డిగ్రీ చదివాడు తను. తెలుగు, ఇంగ్లీషుల్లో అపార పాండిత్యం, పాలనాదక్షత గల రోసయ్య ప్రిన్సిపాల్. ప్రతి విద్యార్థికీ భవిష్యత్తు గురించి ఎన్నో ఆశలుండేవి. కొన్ని ఆదర్శాలుండేవి. విద్యార్థులు ముఠాలుగా ఏర్పడటం, స్టాఫ్ కళ్లముందే తన్నుకోవటం తెలీదు. తన మూడేళ్ల డిగ్రీ చదువులో ఇద్దరు విద్యార్థులు కావాలి, స్టాఫ్‌ని ధిక్కరించారు. వేర్వేరు సందర్భాల్లో. ఒకసారి పాలిటిక్స్ లెక్చరర్‌కి ఒక స్టూడెంట్ మీద కోపం వచ్చి క్లాసులో నోట్సు చెప్పటం మానేశాడు. చివరికా స్టూడెంట్ వెళ్లి క్షమాపణ చెబితేనే గాని పరిస్థితి చక్కబడలేదు.

ఉద్యోగంలో చేరిన కొత్తలో లైబ్రరీలో ఒక సమావేశం జరిగింది. తెలుగు లెక్చరర్ తైత్తిరీయ ఉపనిషత్తులోని ఒక శ్లోకం చెప్పాడు. అది పూర్వకాలం గురుకులాల్లో గురుశిష్యులిద్దరూ కలిసి చేసే ప్రార్థన అట.

'ఓం సహ నా వవతు సహ నౌ భునక్తు
సహ వీర్యం కరవావహై
తేజస్వి నా వధీతమస్తు మా విద్విషా వహై
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః'

(అతడు మన ఇరువురిని కాపాడు గాక! మన ఇరువురికి భుక్తి ప్రసాదించు గాక! మనకు శక్తి కలుగు గాక! మన చదువు తేజస్వంతమగును గాక! మన ఇద్దరికీ విద్వేషం లేకుండు గాక!)

ఎంత ఉన్నత భావన! అప్పటి ఆదర్శ విద్యా విధానం గురించి ఎన్నో ఊహలు చేసేవాడు తను. ఆ శ్లోకంలో చెప్పినట్లు 'తేజస్వంతుడు' కావటానికే ఎప్పుడూ ప్రయత్నించాడు. బహుశా కౌమార దశలో ప్రతి మనిషికీ ఒక ఆదర్శవ్యక్తి ఉంటాడు. అతని ప్రవర్తన చుట్టూ తన కలలన్నీ గూడు కట్టుకుంటాయి. ఇంగ్లీషు లెక్చరర్ సత్యనారాయణ కొన తేలిన ముక్కు, ఎప్పుడూ ఆహ్లాదంగా మాట్లాడే తత్వం, విపులంగా సరదాగా పాఠం చెప్పే విధానం తనకెంతో యిష్టం. 'తాటి వనమున ఆగి చంద్రుడు తాను చెవి యొగ్గెన్' అన్నట్టు ఎక్కడెక్కడి విద్యార్థులూ క్లాసు బయట మూగేవారు. షేక్స్పియర్ నాటకం చెబుతుంటే ఆయనే 'జూలియస్ సీజర్' అయిపోయేవాడు. 'బ్రూటస్' అయిపోయేవాడు. తను ఇంగ్లీషు లెక్చరర్‌గా ఆయన నుంచే స్ఫూర్తి పొందాడు. ఇప్పుడు తన తరం అధ్యాపకుడు పాఠంలో అట్లా లీనం కాలేకపోతున్నాడు.

ఇవాళ పట్నంలో కులానికో కళాశాల. ఎన్నికలు గురించో, వర్గాల గురించో, అమ్మాయిల గురించో నెలకో ఘర్షణ. విద్యా సంవత్సరంలో పట్టుమని నాలుగు నెలలైనా కాలేజీ నడవదు. దేశంలో ఏ ప్రిన్సిపాల్‌కీ స్టూడెంట్స్ మీద పట్టు లేదు. తమ జీవితమెలాంటిదో తెలియజెప్పని సబ్జెక్టుల మీద స్టూడెంట్స్‌కి 'గురి' లేదు. కళ్ల ముందు నిర్దిష్టమైన ఆదర్శం లేదు. వాళ్ల దృష్టిని మళ్లించటానికి ఎన్నెన్ని కాలక్షేపం పత్రికలు, చెత్త సినిమాలు, టీవీలు, ఇంటర్నెట్‌లు, బార్‌లు! ఫలితం, అన్ని రకాల విచ్చలవిడితనం. ఇవాళ సాధారణ విద్యార్థి జీవితంలో అధ్యాపకుడికి స్థానం లేదు. "మాస్టారూ! మీరు తప్పుకోండి" అన్న వాక్యం వెనుక ఎంత బాధాకరమైన అర్థం ఉంది?

❖ ❖ ❖

ఎవరో కాలింగ్ బెల్ మోగించారు. ఆలోచనలు చెదిరిపోయాయి. వనజ చూసి, ఎవరో స్టూడెంట్స్ వచ్చారని చెప్పింది. ఆనంద్ బెడ్ మీద నుంచి లేచి వరండాలోకి వచ్చాడు. ఏడెనిమిది మంది విద్యార్థులు. ఫస్ట్ బి.ఎ., సెకండ్ బి.యస్సీ వాళ్లు. తనను చూడగానే విష్ చేశారు.

"దెబ్బ బాగా తగిలిందా మాస్టారూ?" అడిగాడు వెంకట్రావు అనే స్టూడెంట్.

నవ్వుతూ తలూపాడు ఆనంద్.

"ఆ గ్రూపుని మేం వదిలిపెట్టం సార్! ముఖ్యంగా వాడు-మదన్ మోహన్ - వాడే అన్నిటికీ కారణం" అన్నాడు మరో విద్యార్థి భాస్కర్ ఉద్రేకంగా.

"పోనీలే, వదిలెయ్యండి. వాళ్లు కావాలని నన్ను తోసి ఉండరు గదా" చెప్పాడు ఆనంద్.

"అది కాదు సార్! వాణ్ణి మీరు తక్కువగా అంచనా వెయొద్దు. ఎంతమంది ఆడపిల్లల్ని..... మీకింకా తెలీలేదా సార్? గాయత్రి ఆత్మహత్య చేసుకుంది."

ఆనంద్ తల తిరిగిపోయింది. గాయత్రి తనకెంతో ఇష్టమైన స్టూడెంట్. ఆత్మహత్య చేసుకుందంటే నమ్మలేకపోయాడు. వాళ్ల వెంట వచ్చిన లలిత వంక చూశాడు.

"మా అందరితో ఎంతో ఫ్రెండ్లీగా ఉండేది సార్! అప్పుడప్పుడు మదన్ మోహన్ వేధిస్తున్నట్లు చెప్పి బాధపడేది. నెలరోజుల కిందట అందరం కలిసి ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చేశాం. ఏమీ జరగలేదు. చివరికిట్లా చేస్తుందనుకోలేదు." లలిత చెప్పింది కన్నీళ్ల మధ్య.

"మొన్న కాలేజీలో తగాదాకి అదే కారణం మాస్టారూ! గాయత్రివాళ్ల అన్నయ్య (ముకుందం, సెకండ్ బి.యస్సీ), ఇంకా మా ఫస్టియర్ బియ్యే వాళ్లు మదన్ మోహన్ గ్రూప్‌ని నిలదీశారు. మీరు అడ్డం రాకపోతే అక్కడే తేలిపోయేది. నిన్న గాయత్రి ట్యూషన్‌కి వెళ్లొస్తుంటే మదన్ మోహన్ అడ్డం తగిలి, బాగా అల్లరి చేశాడు. అందరూ చూస్తుండగానే ముద్దు పెట్టుకున్నాడు. గాయత్రి ఏడుస్తూ ఇంటికెళ్ళి... బావిలో దూకింది." చెప్పాడు వెంకట్రావు.

ఆనంద్ ఏం మాట్లాడలేకపోయాడు. తలలో పోటు. ఒక్కసారి గాయత్రి రూపం కళ్ల ముందు మెదిలింది. ఎంతో నెమ్మదైన అమ్మాయి. చక్కగా ఉండేది. ఫస్టియర్ బి.ఎ. అప్పుడప్పుడూ సందేహాలు తీర్చుకోవటానికి ఇంటికొస్తుండేది. ఇంట్లో వనజతోనూ కలిసిపోయింది. సబ్జెక్ట్‌లో గొప్ప తెలివితేటలు లేకపోయినా శ్రద్ధ ఉండేది. తనంటే ఎంతో అభిమానం. ఒకరోజు తనతో చెప్పింది, బి.కాం. కుర్రాళ్లు ఒకళ్లిద్దరు తనను వేధిస్తున్నట్టు. ధైర్యంగా ఉండమనీ, అవసరమైతే ప్రిన్సిపాల్‌తో మాట్లాడదామనీ చెప్పాడు తను. ఒకసారి ప్రిన్సిపాల్‌తో చెబితే ఆయన ఇదంతా మామూలే అని సీరియస్‌గా తీసుకోలేదు.

తల్చుకునేకొద్దీ ఆనంద్ మనసులో సుళ్లు తిరుగుతున్న బాధ. మనసు పరిపరివిధాల పోయింది. ఒంట్లో నిస్సత్తువ ఆవరించింది. అయినా అలాగే వచ్చిన విద్యార్థులతోపాటు గాయత్రి ఇంటికి వెళ్లాడు. నిన్న మొన్నటిదాకా లేతమొగ్గలా మెరిసిపోయిన అమ్మాయిని, 'మీ పాఠం నాకు చాలా ఇష్టం మాస్టారూ!' అనే అమ్మాయిని నిర్జీవంగా చూళ్లేకపోయాడు. లోనుంచి ఒక దుఃఖం, మరో ఆవేశం తన్నుకొచ్చాయి. వికలమైన మనసుతో ఇంటికి తిరిగి వచ్చాడు.

గాయం మానకపోయినా మర్నాడు కాలేజీకి వెళ్లాడు ఆనంద్. కాలేజీ వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. మదన్ మోహన్ కనిపిస్తే తన్నటానికి ఓ వర్గం సిద్ధంగా ఉంది. ఫస్ట్ అవర్ క్లాసుకు వెళితే స్టూడెంట్స్ ఎవరూ రాలేదు. కాసేపుండి స్టాఫ్ రూంకి తిరిగివచ్చాడు ఆనంద్. ప్రిన్సిపాల్ రూం ముందు స్టూడెంట్స్ గుమిగూడి ఉన్నారు. మదన్‌మోహన్‌ని కాలేజి నుంచి డిస్మిస్ చెయ్యాలని వాళ్ల డిమాండ్. ఒక మెమొరాండం ప్రిన్సిపాల్‌కిచ్చారు.

ప్రిన్సిపాల్ ఎ. చక్రవర్తికేం పాలుపోలేదు. ('అవినీతి చక్రవర్తి' అని ఆయునకి విద్యార్థులు పెట్టిన నిక్ నేమ్.) అర్జంటుగా స్టాఫ్ మీటింగ్ వేశాడు.

"ఆ స్టూడెంట్ మీద పోలీస్ కంప్లైంట్ ఇవ్వండి." అన్నాడు కెమిస్ట్రీ లెక్చరర్.

"అందుకు మన దగ్గర సాక్ష్యాధారాలేమున్నాయి? అదీగాక అవతల మదన్ మోహన్ ఫాదర్ పొలిటికల్ ఫిగరైపోయాడు. తొందరపడితే అభాసుపాలవుతామేమో" అన్నాడు ప్రిన్సిపాల్ మాటలు నాన్చుతూ.

"పోనీ అతనికి టిసి. ఇచ్చి పంపెయ్యండి. కాలేజీ కాస్తయినా బాగుపడుతుంది" అని సూచించాడు తెలుగు లెక్చరర్. ఆ సలహా కూడా ప్రిన్సిపాల్‌కు రుచించలేదు. గట్టి సమస్య వచ్చినప్పుడల్లా ఆయనకి స్టాఫ్ సహకారం కావాలి. ఆ ఉదయం ఆయనకు మదన్ మోహన్ తండ్రి నుంచి ఫోనొచ్చింది. కొడుకు తరఫున తను క్షమాపణ కోరుతున్నాననీ, సమస్యని మొగ్గలోనే తుంచెయ్యమనీ దాని సారాంశం. అందువల్ల ప్రిన్సిపాల్ ఈ విషయంలో తొందరపడదల్చుకోలేదు. ఆయనకి హఠాత్తుగా గాయత్రి ఆత్మశాంతి గుర్తొచ్చింది. వెంటనే అందర్నీ నిలబెట్టి ఒక నిముషం మౌనం పాటింపజేశాడు. తర్వాత మళ్లీ అభిప్రాయసేకరణ కొనసాగింది.

ఆనంద్ మాట్లాడుతూ "కాలేజీ పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. స్టూడెంట్స్‌కి మంచిబోధనతో పాటు, వాళ్ల సత్ప్రవర్తనకి కూడా మనం ప్రయత్నించాలి. ఈ రెండిటిలోను విఫలమవుతున్నాం. ఇందుకు ప్రిన్సిపాల్‌గా మీదే ప్రధాన బాధ్యత. ఆ స్టూడెంట్ మీద యాక్షన్ తీసుకోండి. కాలేజీ పతనాన్ని ఇప్పటికైనా అరికడదాం" అన్నాడు.

ఆ తర్వాత జువాలజీ మేడం, మరో ఇద్దరు లెక్చరర్లు ఆనంద్ మాటల్ని సమర్థించారు. కొంతమంది ఎటూ తేలకుండా మాట్లాడారు. పొలిటిక్స్ కోటేశ్వరరావు మాత్రం మరో రకం.

"జరిగిన సంఘటనకు తప్పకుండా సానుభూతి చూపించాల్సిందే. కానీ, ఇందులో ఆనంద్‌గారి మాదిరిగా మనం హర్ట్ కావాల్సిన పని లేదు. స్టూడెంట్స్ అరాచకం దేశమంతా ఉన్నదే. ఇందుకు ప్రిన్సిపాల్ గానీ, మనంగానీ ఏం చెయ్యగలం? అసలా అమ్మాయి మదన్ మోహన్ ప్రవర్తనని అంత సీరియస్‌గా తీసుకుని ఉండాల్సింది కాదు."

"కరెక్ట్." బలపరిచాడు కామర్స్ లెక్చరర్.

ప్రిన్సిపాల్ ఆమోదసూచకంగా తలూపాడు. సమస్యని వాళ్ళంత తేలిగ్గా ఎలా తీసుకోగలుగుతున్నారో ఆనంద్‌కు అర్థం కాలేదు. గాయత్రి తమ కూతుళ్లలాంటిది కాదా?

స్టాఫ్‌లో ఏకాభిప్రాయం కుదరలేదు. ప్రిన్సిపాల్ మీటింగ్‌ని తెలివిగా రేపటికి వాయిదా వేశాడు. అప్పటికి సమస్య వేడి కాస్త తగ్గకపోతుందా అని. విద్యార్థి నాయకులు వస్తే గాయత్రి విషయంలో ఏం చెయ్యాలో రేపు నిర్ణయిస్తామని చెప్పాడు. ఆ జవాబు వాళ్లకే మాత్రం రుచించలేదు. ప్రిన్సిపాల్‌తో వాదానికి దిగారు. స్టాఫ్ రూంలో కాసేపు గాయత్రి గురించిన ప్రస్తావన వచ్చింది. కాసేపు స్టూడెంట్స్ ఇండిసిప్లిన్ గురించి. అంతలోనే వాళ్ల మాటలు లోకాభిరామాయణం వైపు మళ్లాయి. వాళ్లు చాలా మొద్దుబారిన మనుషుల్లాగా అనిపించింది ఆనంద్‌కి. ఒకవైపు ప్రిన్సిపాల్ అసమర్థత తలపుకొస్తోంది. వెనుకటి ప్రిన్సిపాల్ విశ్వనాథంగారి వారసుడేనా ఈయన? ఒక్కసారిగా ఎర్రని భారీ శరీరంతో, బట్టతలతో, బొద్దుమీసంతో ఒకానొక రూపం కళ్లముందు మెదిలింది.

❖ ❖ ❖

అవి తను ఉద్యోగంలో చేరిన కొత్త రోజులు. అర్వై డెబ్భై విద్యార్థుల ముందు హఠాత్తుగా నిలబడి పాఠం చెప్పటానికి కొంత ధైర్యం, మాటల ధాటి, సులువుగా విషయాన్ని విశ్లేషించు కుంటూ పోయే ఒడుపు - ఎన్నో అవసరమయ్యాయి. ఉపన్యాస కళ అబ్బీ అబ్బని ఆ దశలో ప్రిన్సిపాల్ విశ్వనాథరావు ఎన్నో సలహాలిచ్చాడు. సంసిద్ధత లేకుండా పాఠం చెప్పొద్దని-పాఠం ఒక సృజనాత్మక కార్యమని-సందర్భాన్నిబట్టి పాఠంలో వేరే అంశాలు కూడా చెప్పాలని-విద్యార్థుల్ని స్నేహితులుగా భావించమని-చనువుగా ఉంటూ వాళ్లను అదుపులో పెట్టుకొమ్మని - ఇలా ఎన్నో. అన్నిటికన్నా గొప్పది, నీ పాఠంలో నువ్వు ఆత్మీయంగా లీనం కావాలన్నది. కేవలం మూడేళ్లలో తను కాలేజీలోని బెస్ట్ లెక్చరర్లలో ఒకడుగా పేరు తెచ్చుకున్నాడు. క్లాసిక్స్‌తో పాటు గ్రామర్ బాగా చెపుతాడని తనకి మంచి పేరు. ఒక సందర్భంలో ఆయన జీవితకాలం గుర్తుండే మాట చెప్పాడు.

"ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి సుమా!"

ఏ రంగంలోనైనా విలువలు నిలబడటానికి త్యాగాలు అవసరం. ప్రిన్సిపాల్ విశ్వనాథరావు అలా త్యాగం చేసినవాడే. తను ఉన్న వ్యవస్థతో ఆయనెప్పుడూ పేచీపడలేదు. దానిని యథాతథంగా గ్రహించి అందులోని లోపాన్ని తొలగించుకునే దిశలో కొన్ని విలువలకు కట్టుబడ్డాడు. మరికొన్నిటిని స్వయంగా కనిపెట్టాడు. ఆయన ఆలోచన ఎప్పుడూ కాలేజీ మీదే. ప్రతిరోజూ అసెంబ్లీ ఉండేది. తరచుగా అసెంబ్లీలో ఎన్నో విషయాలు చెప్పేవాడు.

ఆటలంటే ఆయనకెంతో ఇష్టం. స్టూడెంట్స్‌తో కలిసి ఆడేవాడు. ఆయన హయాంలో నాలుగేళ్లు కాలేజీ టీమ్ ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ టోర్నమెంటులో గెలుపొందింది. క్లాసులో

అధ్యాపకుడికి, విద్యార్థికి ఎడం ఉంటుంది. అది ప్లే గ్రౌండ్‌లో తొలగిపోవడం గమనించాడు తను. అక్కడ అధ్యాపకుడు విద్యార్థిమీద అధికారిగా ఉండడు, సహచరుడుగా ఉంటాడు. అదే విధంగా తను కూడా వాలీ బాల్, బాడ్‌మింటన్, చెస్ ఆటల్లో ప్రావీణ్యం పెంచుకున్నాడు.

పరీక్షలకు ముందు చదువులో వెనుకబడిన విద్యార్థులకు స్పెషల్ కోచింగ్ క్లాసులుండేవి. రాత్రిళ్లు వంతులవారీగా లెక్చరర్లందరూ హాజరై రాత్రి పదిగంటల దాకా స్టూడెంట్స్‌ని చదివించాలి.

"ఆయనకేం, ముసలాయన. మనల్ని కూడా పదింటిదాకా ఉండమనటం అన్యాయం" అనేవాడు కొత్తగా చేరిన కామర్స్ లెక్చరర్.

విద్యార్థుల్ని 'డీల్' చెయ్యటంలో ఆయనది ప్రత్యేక శైలి. తన హయాంలో ఏ విద్యార్థినీ ఆయన కనీసం సస్పెండ్ చెయ్యలేదు. పరిస్థితిని అక్కడిదాకా ఎప్పుడూ రానివ్వలేదు. విద్యార్థుల్లో ఏదైనా అసంతృప్తిని, అరాచకాన్ని ముందుగానే పసిగట్టేవాడు. సాంస్కృతిక కార్యకలాపాల్లో స్టాఫ్‌ని, స్టూడెంట్స్‌ని నిమగ్నం చేసేవాడు. హాల్లో ఇన్విజిలేటర్‌లు లేకుండానే పరీక్షలు నిర్వహించే వాడు.

ఇవాళ విశ్వనాథరావు గారి పటం మాత్రమే ఆఫీసులో నిశ్శబ్దంగా వేలాడుతోంది. ఆయన నిలిపిన ఆదర్శాలు ఎటు పొయ్యాయో తెలీదు. ఇప్పటి ప్రిన్సిపాల్ ఎప్పటికెయ్యది ప్రస్తుతమో ఆలోచిస్తాడు. స్పెషల్ ఫీజు ఫండ్స్‌ని ఎలా దారి మళ్లించాలో ఆలోచిస్తాడు.

❖ ❖ ❖

"గాయత్రీ - అమర్ హై."

ఒక నినాదం కళాశాల ఆవరణ అంతా మారుమోగింది. స్టాఫ్ రూంలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది.

"గాయత్రీ - అమర్ హై."

"గాయత్రి ఆత్మహత్యకు బాధ్యులైన దోషుల్ని శిక్షించాలి."

"అసమర్థుడైన ప్రిన్సిపాల్ డౌన్! డౌన్!"

స్టూడెంట్స్ లీడర్ భాస్కర్ స్టాఫ్ రూంలోకి దూసుకొచ్చాడు.

"సార్! గాయత్రి మరణానికి సానుభూతిగా ఊరేగింపు తీస్తున్నాం. మీరు కూడా పాల్గొనాలని స్టూడెంట్స్ తరపున రిక్వెస్టు చేస్తున్నాను."

ఎవరూ మాట్లాడలేదు. మొహమొహాలు చూసుకున్నారు. ఆనంద్‌కెందుకో ఊరేగింపులో పాల్గొనటం తన ధర్మమనిపించింది. చటుక్కున బయటికి నడిచాడు. జువాలజీ మేడం, మరో ఇద్దరు లెక్చరర్లు అతని వెంటే నడిచారు.

బయట వందల మంది విద్యార్థులు బారులు తీర్చి ఉన్నారు. ఊరేగింపు మొదలైంది. వీధులు దాటి మెయిన్ రోడ్ సెంటర్‌కి చేరేసరికి వేరే కాలేజీల విద్యార్థులు కూడా కలిశారు.

"గాయత్రీ - అమర్ హై!"

"గాయత్రి ఆత్మహత్యకి బాధ్యులైన దోషుల్ని శిక్షించాలి."

"ఆత్మహత్యలన్నీ హత్యలే."

నినాదాలతో వీధులు మారుమోగిపోతున్నాయి. ఊరేగింపు కలెక్టరేట్ చేరేపాటికి ఆనంద్ ముందు వరుసలో ఉన్నాడు. చేతిలో ప్లేకార్డ్ ఉంది. పక్కనే లలిత - క్లాసులో ఎంతో బిడియంగా ఉండే అమ్మాయి - దృఢంగా నినాదమిస్తోంది.

విద్యార్థి సమూహం కలెక్టర్‌నీ, ఎస్పీనీ కలిసి దోషుల్ని శిక్షించాలని విజ్ఞప్తి చేసింది. జరిగిన సంఘటనపై విచారించి తగిన చర్య తీసుకుంటామని కలెక్టర్, ఎస్పీ హామీ ఇచ్చారు. విద్యార్థులు విడిపోయేముందు ఆనంద్ సూచన ప్రకారం అన్ని కాలేజీల విద్యార్థులతో ఒక యాక్షన్ కమిటీ ఏర్పాటైంది. తర్వాతేం చెయ్యాలనే ఆలోచన వచ్చినప్పుడు ఆనంద్ చెప్పాడు. చెప్పే క్రమంలోనే అస్తవ్యస్తంగా ఉన్న అతని ఆలోచనలు కూడా ఒక రూపం దాల్చాయి.

"గాయత్రి ఆత్మహత్యతో మొదలైన ఈ చైతన్యం ఇంకా పుంజుకోవాలి. విస్తృతం కావాలి. ఏ వర్గం ఇక్కడ అన్యాయానికి గురవుతుందో ఆ విద్యార్థినులు ముందుకొస్తేనే మన ప్రయత్నం విజయవంతమవుతుంది."

దార్లో జువాలజీ మేడం అంది. "మగవాడు స్త్రీని విలాసవస్తువుగా చూసే సంస్కృతి కొనసాగినంతకాలం ఈ అత్యాచారాలూ, ఆత్మహత్యలూ తప్పవేమోనండీ ఆమెని తన జీవితంలో భాగంగా భావించే కాలం ఎప్పుడొస్తుందో?"

మర్నాడు కాలేజీలో అదే ఉద్రిక్తత. స్టూడెంట్స్ క్లాసులు బహిష్కరించారు. మదన్‌మోహన్ గ్రూపు వాళ్లు ఇద్దర్ని ముకుందం స్నేహితులు తన్నారు. మదన్ మోహన్ ఎక్కడున్నాడో తెలీదు. ప్రిన్సిపాల్ మళ్లీ స్టాఫ్ మీటింగ్ వేశాడు. ఆయనకు భయం పట్టుకుంది. స్టాఫ్ మనస్తత్వాల్లో నిన్నటికీ, ఇవాల్టికీ ఏదో మార్పు. కాలేజీ కమిటీ సెక్రటరీ ప్రిన్సిపాల్‌నీ, స్టాఫ్‌లో అనుకూల వర్గాన్నీ రాత్రి పిలిపించాడని చూచాయగా విన్నాడు ఆనంద్. మదన్ మోహన్ మీద చర్య తీసుకోకుండా ఏదో రకంగా సమస్యని నీరుగార్చమని సెక్రటరీ చెప్పినట్లు వార్త పొక్కింది. అలా జరక్కపోతే ప్రిన్సిపాల్‌ని ఏదో ఒక ఫండ్స్ దుర్వినియోగంలో ఇరికిస్తామనీ, లెక్చరర్ల ప్రైవేట్ ట్యూషన్ల మీద దెబ్బతీస్తామనీ బెదిరించినట్టు తెలిసింది. సెక్రటరీకి, మదన్ మోహన్ తండ్రికి రాజకీయ సంబంధాలున్నాయి.

స్టాఫ్ మీటింగ్‌లో లెక్చరర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఆనంద్‌తో పాటు తెలుగు, జువాలజీ, హిస్టరీ లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్ ఆ విద్యార్థి మీద గట్టి చర్య తీసుకొమ్మనే వర్గం. తక్కినవాళ్లు ఇలాంటి వేధింపులు సర్వత్రా ఉన్నవే కాబట్టీ, గాయత్రి ఆత్మహత్య తొందరపాటు చర్య కాబట్టి ఆ విద్యార్థిని చూసీ చూడనట్లు చిన్న పనిష్మెంట్‌తో వదిలేస్తే సరిపోతుందన్నారు.

పర్యవసానంగా ప్రిన్సిపాల్ మదన్ మోహన్‌ని - పెండింగ్ ఎంక్వైరీ - సస్పెండ్ చేశాడు. అతనిమీద పోలీసు కంప్లయింట్ ఇవ్వటం లేదు. కాలేజీకి వారం రోజులు సెలవు ప్రకటించారు. ప్రిన్సిపాల్ రూం దగ్గర స్టూడెంట్స్ గుమిగూడారు. మదన్ మోహన్‌ని కేవలం సస్పెండ్ చేశారనే వార్త తెలిసి రెచ్చిపోయారు. 'ప్రిన్సిపాల్ డౌన్! డౌన్!' అనే నినాదాలు మారుమోగాయి. స్టాఫ్ రూంలో మాత్రం ఆ సీరియస్‌నెస్ లేదు. విద్యార్థుల గొడవలకు స్టాఫ్ ఎప్పుడో అలవాటు పడిపోయారు.

"అయినా, ఈ ప్రిన్సిపాల్ మాట మాట్లాడితే మీటింగ్ పెట్టి మనల్ని బాదుతాడేమిటి?"

"ఏం చేస్తాడు? అవతల స్టూడెంట్స్ ఆయన్ని బాత్తుంటే, ఆయన మనల్ని బాత్తున్నాడు."

ఒక్కసారిగా నవ్వులు. "ఏమైనా వాడిమీద యాక్షన్ తీసుకోవాల్సిందేలే."

"ఏం చెబుతున్నాడ్రా మనవాడు? మొన్న లాబ్‌లో ఫస్టియర్ పిల్ల చెయ్యి పట్టుకున్నావంటగా?"

"నేనా? రామ రామ."

"రామ రామ కాదు, 'రమా! రమా!'" ( ఆ అమ్మాయి పేరు రమలే).

మళ్లీ నవ్వులు. "సరేగానీ ఈ మధ్య షేర్లేం కొన్నావు?"

"రిలయన్స్ ఐదొందలు కొన్నాను. ప్రైమరీలో ఇంకా నాలుగు అప్లై చేశాన్లే."

"ఇంతకీ క్లాసుల్లేవుగదా! పర్మిషన్ తీసుకుని వెళితే పోలా?"

"అవున్లే, వెళ్లి రియల్ ఎస్టేట్ పనులైనా చూసుకోవచ్చు."

"నా బిజినెస్ ఎంత జేసు? నా సంపాదనెంత జేసు? నీలాగా రెసిడెన్షియల్ కోచింగుల్లో, ప్రైవేట్ ట్యూషన్స్‌లో పండిపోలేదు గదా!" (అన్నట్టు మదన్‌మోహన్ నీ ట్యూషన్ కాండిడేట్ కాబట్టే గదా వాడిమీద యాక్షన్ వద్దన్నావు?)

"పండిపోవటమంటే మన ఫిజిక్స్ కామేశ్వర్రావే. గ్రాండ్‌గా పక్కపక్కనే రెసిడెన్షియల్ కాలేజీయే పెట్టాడుగదా? ఓపికున్నంత వరకు పిల్లల్నుంచి దండుకోవటమే." (కాకపోతే సెక్రటరీకి లోపాయికారీగా కాస్త సమర్పించుకుంటుంటే చాలు, అట్నుంచి ఎలాంటి ఇబ్బందీ ఉండదు).

వినేకొద్దీ ఆనంద్‌కి మనస్తాపం ఎక్కువైంది. భగ్నమైన తన కల. ముక్కలు ముక్కలుగా... పదేళ్లుగా ఎన్నెన్ని విలువలు గాల్లో కలిసిపోయాయి! పతనమయ్యేకొద్దీ దాని ద్రవ్యరాశి ఊహించలేనంతగా పెరిగిపోతుంది. క్రమశిక్షణారాహిత్యం, బాధ్యతారాహిత్యం, సమ్మెలు, కొట్లాటలు, ఆడపిల్లల వేధింపులు, రసంలేని పిప్పిలాంటి పాఠాలు, అధ్యాపకుల పక్కదార్లు, పాఠాలు వదిలేసి ట్యూషన్లు. సొంత వ్యాపారాలు. పుట్టకొక్కుల్లా రెసిడెన్షియల్, కార్పొరేట్ కళాశాలలు. విద్యార్థి - అధ్యాపకుల మధ్య వర్గ శత్రుత్వం. బూటకపు పరీక్షలు. బూటకపు వాల్యుయేషన్. బతుకుతో సంబంధం తెగిపోయిన విద్యావ్యవస్థ. భగ్నమై విలవిల్లాడే కల. తనిక్కడ పూర్తిగా 'మిస్ ఫిట్'.

తరతరాలుగా మౌలికమైన మార్పులేని విద్యావ్యవస్థ ఒకవైపు. ఎంతో వేగంగా మారిపోతున్న సమాజం, విద్యార్థి మనస్తత్వం మరోవైపు. 'విజ్ఞానం విజ్ఞానం కోసమే' అని నమ్ముకున్న తరం దాటిపోయింది. ఇవాళ తన బతుకు తెరువుతో సంబంధంలేని, తనకు ప్రయోజనం కలిగించని ప్రతి అంశాన్నీ, ఆ అంశాల్ని బోధించే అధ్యాపకుణ్ణీ విద్యార్థి నమ్మలేకపోతున్నాడు. కొత్త విలువలు లేవు. ఉన్న విలువలు పనికిరావు. వాటిని వదిలిపెట్టలేక, వైఫల్యాన్ని అంగీకరించలేక బాధపడేది కొందరు. పూర్తిగా వదిలేసి బండబారిన వాళ్లు కొందరు.

తలమీద గాయం తగ్గుముఖం పట్టింది. ఆనంద్ మామూలుగా కాలేజీకి వెళ్తున్నాడు. మదన్ మోహన్ అంతు లేడు. ప్రిన్సిపాల్ ప్రకటించిన వారం రోజుల సెలవులు ముగిసింతర్వాత కూడా విద్యార్థుల సమ్మె కొనసాగుతోంది. ఆయన భావించినట్టు రోజులు గడిచినందువల్ల విద్యార్థుల్లో పట్టుదలేం సడలలేదు. విద్యార్థుల నుంచీ, పబ్లిక్ నుంచీ వస్తున్న నిరసనని తట్టుకోవటం ప్రిన్సిపాల్‌కి కష్టమైంది. ఆనంద్, జువాలజీ మేడం లాంటి లెక్చరర్లు విద్యార్థుల పక్షం వహించటం వల్ల ఆయనకు లోపల్లోపల గుర్రుగా ఉంది. ఆనంద్‌ని పిలిపించి ఏకాంతంగా మాట్లాడాడు.

"నీ పనేదో నువ్వు చూసుకోక స్టూడెంట్స్ ప్రాబ్లమ్స్‌లోకి తల దూరుస్తావెందుకు ఆనంద్? నీ ప్రవర్తన బాగోలేదనీ, క్లాసులు సరిగా హేండిల్ చెయ్యటం లేదనీ సెక్రటరీకి నీమీద కోపంగా ఉంది. వాళ్లేదైనా యాక్షన్ తీసుకుంటే నష్టపోయేది నువ్వు. మధ్యలో ఇరుకున పడేది నేను. ఏమంటావ్?" అన్నాడు మెత్తగా నచ్చజెపుతూ.

ఆనంద్ ఆయన మాటల్లో లౌక్యాన్ని గుర్తించాడు. చిరాకేసింది. స్పష్టంగా, నిదానంగా సమాధానం చెప్పాడు. "మన వృత్తిలో విద్యార్థుల సమస్యలూ భాగమే గదా సర్! వాటి విషయంలో మన దృక్పథమూ స్పష్టంగా ఉండాలి. ఇక నా ప్రవర్తన, నా క్లాసుల పద్ధతి మీకు తెలియందేముంది? ఒకప్పుడు మీరే నా ఇంగ్లీషు యాక్సెంట్, టీచింగ్ అద్భుతం అన్నారు. నాలో నిజంగా తప్పుంటే చెప్పండి. లేనప్పుడు నేనెవరికీ జవాబుదారీ కానక్కర్లేదుగదా!"

ప్రిన్సిపాల్ చక్రవర్తి మళ్లీ మాట్లాడలేదు. ఆనంద్ ఎంత మంచి టీచరో లోపల్లోపల తనకు తెలుసు. ఏమీ తోచక అటెండర్‌ని కేకేశాడు, ఫస్ట్ బెల్ కొట్టారో లేదో కనుక్కోవటానికి.

ఆ సాయంత్రం ముకుందం, భాస్కర్, లలిత మరికొంతమంది విద్యార్థి కార్యాచరణ సమితి నాయకులు అనంద్‌ని కలిశారు. టౌన్‌లోని ప్రముఖుల్ని కలిసి ఈ ప్రయత్నానికి వాళ్ళ తోడ్పాటు కోరినట్లు చెప్పారు.

"గాయత్రికి జరిగిన అన్యాయం ముందు ముందు మరే అమ్మాయికీ జరక్కుండా మీ ప్రయత్నం కొనసాగించండి" అని చెప్పాడు ఆనంద్.

"అలాగే సార్!" అన్నాడు ముకుందం వెంటనే. చెల్లెలి ఆత్మహత్య కలిగించిన దిగులునుంచి కొంత తేరుకున్నట్టు కనిపించాడు.

ఆనంద్ సూచన ప్రకారం కార్యాచరణ సమితి వాళ్లు పట్నంలోని మేధావుల్తో, విద్యార్థుల తల్లి దండ్రుల్తో టౌన్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఎంతో మంది విద్యార్థినులు హాజరుకావటం విశేషం. జువాలజీ మేడం గాయత్రి ఆత్మహత్య పూర్వాపరాల గురించి చెప్పింది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఒక పెద్దాయన - రామశేషయ్య, ఇద్దరు లాయర్లు, ఒక డాక్టరు - సంఘంలో పెరిగిపోతున్న విచ్చలవిడితనం గురించి, స్త్రీలకు - ముఖ్యంగా విద్యార్థినులకు రక్షణ లేకపోవడం గురించి మాట్లాడారు. రకరకాల సూచనలు చేశారు.

తర్వాత ఆనంద్ మాట్లాడుతూ, "విద్యార్థినులు, ఇతర స్త్రీలు, ఆ మాటకొస్తే సమాజంలోని ప్రతి మంచి వ్యక్తికీ రక్షణ కల్పించటం వ్యవస్థ బాధ్యత. ఆ బాధ్యత నెరవేర్చలేక వ్యవస్థ విఫలమవుతున్న తరుణంలో సామూహికంగా ఆత్మరక్షణే మిగిలింది. ఆ ప్రయత్నం గురించి ఆలోచిద్దాం" అన్నాడు.

ఆ చర్చలో లలిత విద్యార్థినుల పరిరక్షణ కోసం ఒక సమితి ఏర్పడితే బావుంటుందని సూచించింది. అందరూ ఆ సూచనని ఆమోదించారు. రామశేషయ్యగారు గౌరవాధ్యక్షులుగా, ఆనంద్, జువాలజీ మేడం, ఇంకా ఇద్దరు సలహాదారులుగా, పదిమంది విద్యార్థినీ విద్యార్థులు సభ్యులుగా 'విద్యార్థినీ పరిరక్షణ సమితి' ఏర్పడింది. సమావేశం పూర్తవుతుండగా ఒక విద్యార్థి వచ్చి, మదన్ మోహన్ అరెస్టు అయ్యాడనీ, పోలీసులు అతనిమీద సెక్షన్ 306 కింద కేసు పెట్టారనే వార్త ప్రకటించాడు. అంతా చప్పట్లు కొట్టారు. ఆనంద్‌కి మాత్రం 'మదన్‌మోహన్ వ్యవస్థలోని అరాచకత్వానికి ఒక సంకేతం మాత్రమే. అసలు మూలకారణం మాసిపోవటానికి ఎంతకాలం పడుతుందో' అనిపించింది. దోషికి శిక్షపడినా గాయత్రి తిరిగిరాదు. 'మాస్టారూ! మీ పాఠం నాకు చాలా ఇష్టం' అని చెప్పే ఆ గొంతు వినపడదు.

సమావేశం ముగిసిన తర్వాత ముకుందం, లలితలతో కలిసి ఇంటికి బయల్దేరాడు ఆనంద్. వినోదా సెంటర్ దాటి వీధి మలుపు తిరుగుతుండగా ఎవరో వెనుకనుంచి 'సార్!' అని పిలిచారు. తిరిగి చూస్తే సెకండ్ బి.కాం. స్టూడెంట్ ప్రభాకర్ కనిపించాడు. ఆనంద్ ఆగగానే దగ్గరికి వచ్చి "అయామ్ సారీ సార్!" అన్నాడు.

"ఎందుకు?" ఆశ్చర్యంతో అడిగాడు ఆనంద్.

"ఆ రోజు కాంపస్‌లో జరిగిన గొడవలో మిమ్మల్ని తోసింది నేనే సార్!" అన్నాడు తలవంచుకుని.

ఆనంద్ ఒక్క క్షణం అతనివంక చూసి, ప్రశాంతంగా భుజం తట్టాడు.

ఒక మనిషిలో ఒక మార్పు. ఆనంద్ మనసు తేలికపడింది.